

సచ్ఛిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 18 జనవరి, 2022 సంచిక : 8

**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**
**సంస్థాపక సంపాదకత్వం :**
**శ్రీ మాతా శుకవాణి**
**ప్రధాన సంపాదకత్వం :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ**
**ప్రత్యేక సహకారం :**
డా॥ జి.చంద్రారెడ్డి M.A, M.Ed., Ph.D
శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)
శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)
**ప్రచార సారధ్యం :**
శ్రీ బి. గోపీకృష్ణ
శ్రీమతి బులుసు జయ

**సాయివాణి చందా వివరాలు**

ద్వైవార్షిక చందా. ......... రూ॥ 200/-
ఆజీవ సభ్యత్వం .......... రూ॥1000/-

**చిరునామా :-**
**సాయివాణి**
సాయిధామం, బొమ్మల రామవరం మండలం,
యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.
Ph : 9440413455, 9848133565

Online Donations :
SRI SAI SEVA SAMITHI TRUST
A/c No.62002652136
SBI Keesara Branch,
IFSC Code : SBIN 0020639

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి ........ 2
ఈ దేశం పైకి రావాలంటే ........ 5
బాలవాణి-లేమిలో కలిమి ........ 10
ఎవరికి ఉపదేశం చెయ్యాలి ........ 11
సాయి సేవక్-శ్రీ శివనేశన్ ........ 13
శ్రీ సాయి నిత్య పారాయణ ........ 16
సాయిభక్త దాసగణు ........ 19
శాశ్వత ధర్మగోప్త ........ 22
మాతృసంస్థ కబుర్లు ........ 25
జ్ఞానే నిత్యసుఖి ........ 30
ఆశ్రమభిక్ష ........ 32

ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







# మా వాణి



**సాయి బంధువులందరికీ నమస్కారం.**

ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు. మకర సంక్రమణ శుభ వేళ అందరికీ సాయిరక్ష. "నెలపట్టారు గదా మాతాజీ, గొబ్బెమ్మలు పెట్టనా?" అంటూ వచ్చింది పాపాయి. ఏం చెప్పాలో తోచలేదు. ఆ మాటకొస్తే మీకందరికీ శుభాకాంక్షలు చెప్పాలన్నా గానీ-హృదయాంతరాళాలలో నుండీ రావటం లేదది. ఇది పండుగేనా నిజంగా! హిందూ దేశంలో సనాతన సాంప్రదాయాలను మన్నించే హిందువులందరూ ఆయా కాలాలలో జరిగిన కొన్ని సంఘటనలు ఆధారంగా చేసుకొని కొన్ని ఉత్సవ దినాలను ఏర్పరచుకున్నారు. ఆయా ఋతువులను అనుసరించి వచ్చే మార్పులకు గుర్తుగా కొన్ని పర్వదినాలు ఏర్పడగా-దుష్ట సంహారం జరిగిన రోజులను దృష్టిలో ఉంచుకొని కొన్ని ఏర్పడ్డాయి. ఇవన్నీ మన ధర్మాన్ని మనకు గుర్తుచేయడమే గాదు. చక్కని వైజ్ఞానిక దృష్టితో ముడిపడి ఉన్నాయి. అనాదికాలంగా ఈ పండుగలు మన జీవనాలతో పెనవేసుకొని ఉన్నాయి.

అయితే ఇప్పుడు మనం ఈ పండుగలను నిజంగా గౌరవంతో, భక్తితో ఆచరిస్తున్నామా? ఏదో అలవాటుగా, మొక్కుబడిగా జరుపుకుంటున్నామా? అన్నది ప్రశ్న. అదొక్కటే కాదు. మన సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగలను ఒకవైపు మన్నిస్తూనే మరొకవైపు ఆ సంస్కృతిని సర్వధా-అన్నిరకాలా సమాధి చేసే ప్రయత్నం మరోప్రక్క సాగుతోంటే దీన్ని ఏమనుకోవాలి? దాన్ని చూస్తూ హిందువులు -పోనీ హిందూత్వం ఇంకా సజీవంగానే ఉందని ఎలా అనుకోవడం? సాక్షి వ్యాసాలలో జంధ్యాల శాస్త్రిగారు మాతృభాషకు కలుగుతున్న అవమానాన్ని గురించి పడిన బాధ

గుర్తుకు వస్తున్నది ఈ సందర్భంలో అప్పడు ఆయన అన్నట్లుగానే నేనూ అనుకుంటున్నాను". ఈ మాట వినడానికీ, ఈ దౌర్భాగ్యపు కూతలు విని సహించడానికేనా? ఇంత ఆయువిచ్చింది భగవంతుడు?" మహారాణి పద్మినీదేవి జగదేకసుందరి, ఆమెనొకసారి చూడాలని పరపురుషుడెవరో సరదాపడితే అది దేశ గౌరవానికీ, స్త్రీ గౌరవానికి తీరని మచ్చగా భావించి తిరగబడిన జాతినాది. ఒక స్త్రీకి ఒక పురుషుడు-ఒక పురుషునికి ఒక స్త్రీ అనేది ఈ దేశ ధర్మశాస్త్రం చెప్పిన మాట. పూర్వకాలంలోలాగా స్త్రీ పురుషులను ఒకరితో ఒకరు మాట్లాడుకోకుండా మడిగట్టుకు కూర్చోమని ఇప్పడు ఎవ్వరూ అనవసరం లేదు కూడా. విద్యలో, ఉద్యోగంలో, కళలో, కదన రంగంలో ప్రతీ చోట తనకు తానే సాటిగా ఎదుగుతున్న స్త్రీ శక్తిని ముసుగు వెనక దాయమని ఎవరూ అనరు. కానీ, అభివృద్ధి అంటే విచ్చలవిడితనం కాదని ఈ జాతి ఇంత కాలం భావించింది. దానికి గొడ్డలిపెట్టుగా తయారైన అనేక పరిణామాలు ఇప్పడు కొత్తగా మన సమాజంలో చోటు చేసుకుంటున్నాయి.

మన యువతీ యువకులు విద్య పూర్తి అయ్యేంతవరకు బ్రహ్మ చర్యాన్ని పాటించి తీరాలనీ మన ధర్మ శాస్త్ర శాసనం. మనం ఆ అవకాశాన్ని మన బాల, యువ పౌరులకు ఇస్తున్నామా? ఎక్కడ? శరీర సుఖం తప్ప జీవితానికి మరో ఆనందం లేదనీ, ప్రేమ అంటే స్త్రీ, పురుషుల నడుమ ఉన్న కామబద్ధమైన బంధమేననీ విడమరచి చెప్పే సినిమాల ద్వారానా? పూర్వకాలపు వాంప్‌లు, క్లబ్‌డాన్సర్లు వేసుకొనే-కొన్ని సార్లు అంతకన్నా హీనమైన డ్రెస్‌లలో కనిపించే నటీనటుల ద్వారానూ, టీ.వి. అమ్మళ్ళ ద్వారానూనా?

అర్ధరాత్రి పబ్‌లలో చెలరేగే భ్రష్ట సంస్కృతి ద్వారానా? వెన్నెముక లేనట్లూ, కేవలం వెకిలివేషాలకూ, కోతిగంతులకూ మాత్రమే పరిమితమై వ్యక్తిత్వం లేనట్లుండే సినిమా నాయకుల వలననా? అన్ని దిక్కుల నుండీ ముసురుకువచ్చే యీ దౌర్భాగ్యం నుంచీ నా జాతి పతనాన్ని ఆపగల





వారెవరు? యువత యిటువంటి ఉద్వేగాలకూ, ఉద్రేకాలకూ లోనై తమ శక్తి సామర్థ్యాలన్నింటినీ నశింపజేసుకుంటేగానీ-యీ భూమి నిర్వీర్యులైన తోలుబొమ్మలతో నిండిపోదు. అప్పడుగానీ, వేలాది సంవత్సరాలుగా ఎన్ని దెబ్బలు ఒక దాని మీద ఒకటిగా తగులుతున్నాగానీ-తిరిగి తలెత్తుకు నిలుస్తున్న యీ గడ్డ, సర్వభ్రష్టమై, నామరూపాలు లేకుండా నశించిపోదు. ఇంత సుదీర్ఘ ప్రణాళికతో నడుస్తున్న యీ కుట్రను గ్రహించలేని నా సోదరీ సోదరులకు ఏమని శుభాకాంక్షలు చెప్పగలను! భ్రష్టసంస్కృతికి బలిఅయిన యువతను చూచే గుండెలు చిక్కబట్టేస్తోంటే -

ఆ మధ్య - మహామహిమాన్వితమైన అసెంబ్లీలో దేవాదాయ, ధర్మాదాయ శాఖను ధార్మిక కార్యక్రమాలు, దేవాలయాలు - అంటే సంస్కృతీ కేంద్రాలు సవ్యంగా నడిచేటట్లు చూచేందుకై ఉద్దేశింపబడిన శాఖకు చెందిన- చెందిన ఏమిటి-నడిపించే పుణ్యాత్ములొకరు వేదోక్తి వంటి అత్యద్భుత వాక్కునొక్కటి సెలవిచ్చారు. ఏమనీ? - బళ్లో పాఠాలు చదువుకొనే పిల్లలందరి పవిత్ర సరస్వతీరూపాలైన పుస్తకాల సంచులలో కండోమ్‌లు ఉంచి పంపవలసింది అని.

ఆహా! ఏమి పావనోక్తి! ఈ నేలపై బిడ్డలను గన్న తల్లిదండ్రులందరి జన్మలు ధన్యమైపోయే మాట! భరత మాత మేను ఆనందంతో పులకరించే మాట! "ఏ తప్పయినా చెయ్యి - ప్రమాదంలో పడకుండా మాత్రం జాగ్రత్త పడు" అని బడిపిల్లలకు తరుణోపాయం చెప్పే మాట! ఈ దేశ ధర్మాన్ని సమూలంగా నరికి నాశనం చేయగల మాట! శెభాష్! ఇటువంటి మహా నాయకుల పాలనలో మనం ఉండగలగడం మన పూర్వజన్మ సుకృతం గాక మరేమిటి. రేపు మన బిడ్డలూ, మనుమలూ, యిలాంటి కండోమ్ ప్రయోగాలలో ఉండటం ఊహించుకోవాలంటేనే ఒళ్ళు జలదరిస్తోందే! ఇంకా ఈ మహత్తర దశలో యింకా శుభాలూ-వాటి కోసం ఆకాంక్షలునూ! సెలవు తల్లులారా, సెలవు తండ్రులారా, సెలవు.



# ఈ దేశం పైకి రావాలంటే

**- ఎ.పి.జె.అబ్దుల్ కలాం, భారత రాష్ట్రపతి**

నేను అహ్మదాబాద్‌లో స్వామి నారాయణ్ సంస్థ ప్రముఖ స్వామి మహరాజ్‌ను కలిసాను. సైన్సునీ, ఆధ్యాత్మికతనీ సమన్వయపర్చే ఆధ్యాత్మికత పోషించగల పాత్ర గురించి కూడా మాట్లాడాము. మా చర్చ దాదాపు గంట సేపు సాగింది. ఆ రోజు నేనడిగిన ప్రశ్నలూ, వాటికి స్వామీజీ ఇచ్చిన సమాధానాలూ యథాతథంగా ఇక్కడ పొందుపరుస్తున్నాను.

**అబ్దుల్ కలామ్ (అ.క) :** స్వామీజీ 1857 నుంచీ భారతదేశానికి తనొక స్వతంత్ర దేశంగా ఉండాలన్న క్రాంతదృష్టి పడింది. ఆ తరువాత తొంభయ్యేళ్ళు పట్టింది, దానికి స్వతంత్ర దేశంగా ఆవిర్భవించడానికి. ఈ కాలమంతా మొత్తం దేశం పిన్నా, పెద్దా, ధనికా, పేద, విద్యావంతులూ, నిరక్షరాస్యులూ ఒక్క తాటి మీద కలిసి కృషి చేసారు. అప్పుడు ధ్యేయం ఒకటే, దాని మీద అందరి దృష్టి కేంద్రీకృతమై ఉండేది. స్వాతంత్ర్యాన్ని సముపార్జించడమే ఆ లక్ష్యం. స్వామీజీ, ఇప్పుడు మన ముందు అటువంటి లక్ష్యమేదంటారు? లేదా ఆ లక్ష్యమేమయి ఉండోచ్చంటారు? గత యాభయ్యేళ్ళుగా భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశంగా ఉంటున్నది. దానర్థం ఒక ఆర్థిక వ్యవస్థగా అది దృఢంగా లేదనీ. సాంఘికంగా, స్థిరంగా లేదనీ, రక్షణ వ్యవహారాల్లో స్వావలంబన లేదనీ. అందుకనే దాన్ని అభివృద్ధి చెందుతున్న దేశమనే అంటున్నారు. టెక్నాలజీ 'ఇన్ఫర్మేషన్ ఫోర్ కాస్టింగ్ అండ్ ఎసెస్‌మెంట్ కౌన్సిల్‌కి చెందిన ఐదు వందల మంది సభ్యులు కూర్చుని భారతదేశపు భవిష్య దృష్టి ఎలా ఉండాలో అన్న దాని మీద కొంత ఆలోచన చేసాం.

రాబోయే ఇరవయ్యేళ్ళలో మనం భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా ఎలా రూపొందించగలం? మేము అందుకు అయిదు కీలక రంగాల్ని గుర్తించాం. అవి : విద్య, వైద్యసేవలు, వ్యవసాయం, ఇన్ఫర్మేషన్





మరియు కమ్యూనికేషన్ల మౌలిక సదుపాయాలు, కీలక సాంకేతిక పరిజ్ఞానమూ స్వామీజీ, మా సమస్య ఏమిటంటే మేం మా అభిప్రాయాల్ని ప్రభుత్వం ముందేదోలా ఉంచగలం. కానీ, అటువంటి బృహత్తర ఆదర్శాన్ని తలకెత్తుకోవడానికి మాకు ఇప్పుడు కావలసింది విలువల మీద ఆధారపడిన పౌర దళాలు. అవి లేనినాడు వనరులు ఉన్నా సద్వినియోగ పడవు అదే కదా ఇప్పుడు మనం చూస్తున్నది. స్వామీజీ. దీనికి మీ సూచనలు కావాలి.

**స్వామీజీ :** ఈ అయిదింటితోపాటు అరవది కూడా కావాలి. అది భగవంతుడిలో విశ్వాసం, మనుషుల్ని ఆధ్యాత్మికత ద్వారా వికసింపజేయటం. ఇది చాలా ముఖ్యం ఇందుకు ముందస్తుగా మనం శీలవంతమైన ఆధ్యాత్మిక సంబంధమైన వాతావరణాన్ని నిర్మించాలి. ఈనాడు నెలకొని ఉన్న నేర అవినీతిమయ వాతావరణంలో మార్పు రావాల్సి ఉంటుంది. ధర్మబద్ధంగానూ, భగవంతుడిలో నమ్మకంతోనూ జీవించగల మనుషులు కావాలి మనకి. అందుకు మనం వారిలో విశ్వాసాన్ని జాగృతం చెయ్యాలి. అప్పుడే మనకు పనులు చేకూరతాయి. మన సమస్యలు తీరతాయి. మనం కలగన్నది సాధించగలుగుతాం.

**అ.క :** స్వామీజీ, భారతదేశాన్ని నవీకరించాలనే మన బృహత్పథకం ముందు ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పించడంలో మొదలుకావాల్సి ఉంటుందా లేక ముఖ్యరంగాలైన విద్య, ఆరోగ్యం వంటి వాటి అభివృద్ధిలో మొదలుకావాలా? లేదా మనం వీటినన్నిటినీ సమగ్రపరచి ఏకకాలంలోనే ఈ రంగాలన్నిటిలో మనం ప్రయత్నాలు ప్రారంభించాల్సి ఉంటుందా?

**స్వామీజీ :** మనం ఏక కాలంలోనే ముందుకు సాగాల్సి ఉంటుంది. మీ బృందం గుర్తించిన అయిదు ప్రాముఖ్యతా రంగాలోనూ పురోగతి సాగవలసిందే. అదే సమయంలో నైతిక అంశాలు కూడా అందులో భాగం కావాలి. మన సంస్కృతి మనకి పరా, ఆసరా విద్యలు రెండింటినీ నేర్పడం గురించీ చెప్పింది. పరా విద్య ఆధ్యాత్మిక జ్ఞానం కాగా, ఆపరా విద్య ప్రాపంచిక విజ్ఞానం. కాబట్టి అసరా విజ్ఞానంలోనే ప్రతి ఒక్కరూ పరా

విజ్ఞానాన్ని కూడా నేర్వాల్సి ఉంటుంది. ఒకసారి పరావిద్యని గాని నేర్చామా. అప్పుడు మన ప్రాపంచిక విజ్ఞానం ధర్మంపైనా, ఆధ్యాత్మికతపైనా దృఢంగా నిల్చి ఉండగలుగుతుంది. మనం గుర్తుంచుకోవలసింది ప్రతి ఒక్కరూ, ప్రతి ఒక్క ఆత్మా కూడా దివ్యానందాన్ని అందుకోవడమే భగవత్ సృష్టి క్రమం వెనుక ఉన్న పరమ ప్రయోజనం అన్నది.

**అ.క :** ఇటువంటి మహత్తర ఆశయం సిద్ధించటానికి మనకు మూడు రకాల వ్యక్తులు అవసరమవుతారు. వాళ్ళు పుణ్యాత్ములు, అంటే సహజం గానే శీలవంతులు. పుణ్యనేతలు, అంటే శీలవంతులైన నాయకులు. అలాగే, పుణ్యాధికారులు అంటే సత్ప్రవర్తనతో తమ విధులు నిర్వర్తించేవాళ్ళు. ఈ మూడు రకాల మనుషులు వృద్ధిచెందితే భారతదేశం నిజంగానే జగద్గురువు కాగలుగుతుంది. అయితే ఇటువంటి పుణ్యశీలురు వృద్ధిచెందడమేలాగ?

**స్వామీజీ :** మీ విద్యాబోధనలో భాగంగా, మీ వైజ్ఞానిక బోధనలో భాగంగా మన పాఠశాలల్లో, కాలేజీల్లో ఆధ్యాత్మిక శిక్షణ కూడా ఇవ్వండి. ఈ రోజుల్లో నైతిక విద్యని మనం పాఠశాలల, కళాశాలల సిలబస్ నుంచి తీసేశారు. శైశవప్రాయం నుంచే బోధించవలసిన ఆ ముఖ్యమైన విద్యని మనం నిర్లక్ష్యం చేస్తూ కేవలం పుస్తక విద్యకే పరిమితమయిపోయాం. కానీ, నిజానికి ముందు నుంచి అంటే పుట్టినప్పటి నుంచీ మనుష్యజాతి ... బోధించుతూనే ఉండాలి. అప్పుడు మాత్రమే మనుమలు శీలవంతులవు తారు. మన ధర్మశాస్త్రాల గురించిన పరిజ్ఞానం, మన సాధుసత్పురుషుల గురించిన అంశాలు మన పాఠ్యాంశాల్లో పొందుపరచబడాలి. మన మన్ననలనందుకునే సాంఘిక, ఆధ్యాత్మిక రాజకీయ నేతల జీవితాలు అటువంటి విలువలతోనే నిండిఉన్నాయి. ప్రాచీనకాలంలో మన గురు కులాల్లో అటువంటి విలువలే బోధించబడేవి. రాజు గాని పేదగాని ఏ తారతమ్యం లేకుండా ఆ గురుకులాల్లో సమానంగా విద్యార్జన చేసేవారు. వస్తు పరిజ్ఞానంతోపాటు సత్యంవద (నిజాన్నే పలుకు), ధర్మం చర (సక్రమ





మైన దారినే నడు) వంటి ఆదేశాల్నీ, పరోపకారత్వాన్నీ, భగవద్విశ్వాసాన్నీ కూడా అక్కడ ఉగ్గుపాలతో రంగరించేవారు.

**అ.క :** స్వామీజీ, ఉత్తమ పౌరులు ప్రభుత్వ చట్టాల వల్ల ఉత్పత్తికారు అని మనకు తెలుసు. అటువంటి పనిని ఆధ్యాత్మిక కేంద్రాలు చేయగలుగు తాయా? తమ పిల్లలకి పదిహేనేళ్ళు వచ్చేదాకా ఉత్తమ విలువల్ని అలవర్చ వలసిందిగా తల్లిదండ్రుల్ని మనం కోరవచ్చు. కానీ, మనం ఈ పని చెయ్యలేకపోతే అప్పుడు ప్రభుత్వాలు ఉత్తములైన నిజాయితీపరులైన పౌరుల్ని తయారుచేయడంలో విఫలమైపోతాయి. నా అవగాహన సరయినదే అంటారా స్వామీజీ?

**స్వామీజీ :** అవును నిస్సందేహంగా సరయినదే. మేము ముందు నుంచీ చెప్తున్నదిదే, విలువలు మొదట తల్లిదండ్రులచే బోధించబడాలి. తరువాత పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధించాలి. తదనంతర జీవితంలో గురువు ద్వారా బోధించబడాలి.

**అ.క :** స్వామీజీ, నేను మొదట రాకెట్ ప్రయోగించినప్పుడు అది విఫల మయ్యింది. కానీ, మా అంతరిక్ష కేంద్రం అందించిన నైతిక తోడ్పాటుతో నా బృందం ఆ వైఫల్యం పునాది మీంచే తదనంతర విజయాన్ని నిర్మించు కుంది.ఈ అభిప్రాయమే తిరువళ్లువర్ తన తిరుక్కురల్‌లో కూడా చెప్పాడు. వైఫల్యం సంభవించినప్పుడు దాన్ని చిరునవ్వుతో సవాలు చెయ్యి? అని.

**స్వామీజీ :** అటువంటి ఉత్తమ భావాలు కలిగి ఉన్న మనుషులకు దేశాభి మానం సహజగుణమే. అందుకనే మేం ఆధ్యాత్మిక జ్ఞానాన్నిగానీ, తొలి నుంచీ ఇవ్వగలిగారా, అప్పుడు తన దేశం పట్ల, ధర్మం పట్ల, సంఘం పట్ల ప్రేమాభిమానాలు సహజంగానే సిద్ధిస్తాయని అంటున్నాం. శీల విద్య జీవిత పునాది కావాలి.

**అ.క :** నైతిక బలం ప్రధానం. దానితోపాటే ఆర్థికబలం కూడా జత గూడాలి. ఈ ప్రపంచం బలానికే ఆధిక్యం. అందుకని శీలమూ, ఆర్థిక సంపన్నతా రెండూ సమ్మిశ్రితం కావాలి. ఆ రెండింటినీ సాధించడానికి,

మంత్రమూ మార్గమూ ఒకటే-స్వేదం! కఠోరశ్రమ తప్పనిసరి.

**స్వామీజీ :** మేం తరచు చెప్తుంటాం. మానవ ప్రయత్నం, దైవానుగ్రహం అని. మీరు ప్రయోగించిన మొదటి రాకెట్ వైఫల్యమేదయితే మీరు ఎదుర్కొన్నారో అది మీకు మేలు చేసింది. అది మీ నుంచి మరింత మెరుగైన కృషిని బయటకు రాబట్టింది. చివరికి మీకు భగవంతుడు విజయాన్ని అనుగ్రహించాడు.

**అ.క :** భారత దేశాభివృద్ధి కోసం నేను విజన్ 2020 పేరిట ఒక ట్రస్టు స్థాపించాలనుకుంటున్నాను. దానికి సమ మనస్కులైన అయిదుగురు సభ్యుల్ని కోరుతున్నాను.

**స్వామీజీ :** దైవాశీర్వాద మెప్పడూ మీకుంటుంది. మీ ఆశయాలు జయప్రదం కావాలని భగవంతుడిని ప్రార్థిస్తాను. భారతదేశం ఆర్థికంగానూ, ఆధ్యాత్మికంగానూ వృద్ధిచెందుగాక! ఆధ్యాత్మికత ఎంత బలంగా ఉంటే తక్కిన సంపదలు అంతగా వృద్ధి చెందుతాయని నేను చెప్పాలనుకుంటున్నాను. మనం కేవలం వస్తు సంపదనే పెంచుకుంటూపోతే మనిషి ప్రాపంచిక భోగాల్లోనూ, విలాసాల్లోనూ కొట్టుకుపోతాడు. అటువంటి సందర్భంలో ఆధ్యాత్మికత అతనికి దారిచూపుతుంది. ఐహికానందాల మించి పైకి లేపుతుంది. యథార్థానికి మనకు ఏది అవసరమో అది మనం మనకి ఇచ్చుకోనేలేం. మనం తక్కినవన్నీ సమకూర్చుకుంటూ ఉంటాం. దుస్తులు, ఆహారం, ఆశ్రయం. కానీ వీటన్నిటితోపాటు ఆధ్యాత్మిక సంపదని కూడా మనం పోగుచేసుకోవాల్సి ఉంటుంది. మనిషి తనకు కావాల్సిందాన్ని మించి అధికంగా అధికారాన్నిగానీ, సంపదను గానీ పోగు చేసుకున్నాడా అప్పుడతడు తన చేజేతులా వినాశనాన్నీ, అశాంతినీ, విధ్వంసాన్నీ కోరితెచ్చుకున్నట్లేనని మనం మరువకూడదు. అప్పుడతడు అదుపు తప్పుతాడు. మీరీనాడు ఇక్కడికి రావడం బాగుంది. అది మాకెంతో సంతోషాన్నిచ్చింది. మన పూర్వ ఋషులు మనకు విజ్ఞానశాస్త్రాన్ని కూడా అందించారు. మీరు ఆ కోవకి చెందిన ఋషులే.





బాలవాణి

# లేమిలో కలిమి

– 'సాహసమే జీవితం' నుండి

15 యేండ్ల వయస్సులో తీర్థరామ్ 10వ తరగతి పాస్ అయినాడు. పంజాబ్ ప్రాంతం మొత్తంలో మొదటివాడుగా వచ్చాడు. బోర్డువారు అతనిని ప్రోత్సహించేందుకు ఉపకార వేతనం ఇచ్చారు. తీర్థరామ్‌ను పై చదువులు చదివించాలనే కోరిక తండ్రికి లేదు. అయినప్పటికీ తన సొంత శక్తిపై ఆధారపడి తీర్థరామ్ కాలేజీలో చేరాడు. తనకు లభించే ఉపకార వేతనాన్ని కాలేజీ ఫీజు క్రింద చెల్లించేవాడు. పుస్తకాలు కొనుక్కుంటుండేవాడు. భోజనం వగైరాల కోసం ట్యూషన్లు చెప్పకొని ఎలాగో అలా నెట్టుకొని పోదామని నిశ్చయించుకున్నాడు.

అతని ఆదాయం రోజుకు మూడు పైసలు. దీనితోనే అతను తృప్తిపడేవాడు. లాహోరు వంటి నగరంలో ఇంత తక్కువ డబ్బుతో నివసించటం ఎంత కష్టమో ఊహించుకోవచ్చు. తీర్థరామ్ ఒక హోటల్లో రొట్టెలు తినేవాడు. రొట్టెలకు పప్పు ఊరకనే యిస్తుండేవారు. కొంతకాలం అలా సాగింది. హోటల్‌వాడు తన నియమాలు మార్చివేశాడు. పప్పు ఊరకనే ఇవ్వడం జరగదని చెప్పాడు. ఇక తప్పక తీర్థారామ్ సాయంత్రం భోజనం చేయటమే మానివేశాడు. ఒకసారి కొట్లో నుండి వెనుకకు తిరిగివస్తుంటే కాలిచెప్ప తెగి కాలువలో పడిపోయింది. కాలువ లోతుగా ఉంది. చెప్ప మునిగిపోయి కొట్టుకొని పోయింది. విరక్తిభావంతో తీర్థరామ్ మిగిలిన ఒక చెప్ప చేత్తో పట్టుకొని ఇంటికి వచ్చాడు. రెండో చెప్ప ఎక్కడో సంపాదించాడు. అది ఈ చెప్పకు జతగా లేదు. జత కుదరని చెప్పలు వేసుకొని చాలాకాలం కాలక్షేపం చేశాడు. తోటి విద్యార్థులు ఎగతాళి చేస్తుండేవారు. అతడు లక్ష్యపెట్టేవాడు కాదు. నిర్వికారంగా తపోమయమైన జీవితాన్ని

గడుపుతుండేవాడు. అతను ఎంతో శ్రద్ధతో చదువుకొనేవాడు. అన్ని తరగతుల పరీక్షలలోనూ ఎప్పుడూ ప్రథమస్థానంలోనే ఉత్తీర్ణుడవుతూ ఉండేవాడు. లేమితో ఉన్న రోజులలో అతని హృదయం ఎప్పుడూ సద్భావము తోనే నిండి ఉండేది.

తనకున్న ఏ యోగ్యతను అతను వ్యక్తిగత లాభం కోసం ఎన్నడూ ఉపయోగించుకోలేదు. దేశ ధర్మముల నిమిత్తం అతను తనను తాను సమర్పించుకున్నాడు. తీర్థరామ్ "స్వామి రామతీర్థ" అయినాడు. దేశ విదేశాలలో భగవంతుని సేవకై తన జీవితాన్ని వినియోగించాడు.

# ఎవరికి ఉపదేశం చెయ్యాలి

**- గౌతమ బుద్ధుడు**

ఒకసారి గౌతమబుద్ధుడు మగధ దేశంలో పర్యటిస్తూ అళవి అనే కుగ్రామం చేరాడు. ఆ మారుమూల గ్రామస్థులెంతో ఆనందపడ్డారు. సంభ్రమంలో మునిగిపోయారు. మహామహా చక్రవర్తులే గౌతమబుద్ధుడి ముందు చేతులు కట్టుకుని నిలబడతారని వారికి తెలుసు. అలాంటిది అంత గొప్ప వాడు వాళ్ళ ఊరికే దయచేయడంతో వారి ఆనందానికి హద్దులు లేవు.

ఆనాడు సాయంకాలం బుద్ధ భగవానుని ప్రవచనం మొదలయ్యే సమయానికి ఒక రైతు బిడ్డ ఆదరాబాదరాగా వచ్చి కూర్చున్నాడు. అతడు బాగా అలసిపోయి ఉన్నాడు. ఎంతో ఆకలి దహిస్తున్నా, బుద్ధ భగవానుని ఉపదేశం వినడానికి పరిగెత్తుకుంటూ వచ్చి కూర్చున్నాడు. అతడు ప్రొద్దుటి నుండి యేమీ తినలేదు. తప్పిపోయిన ఎద్దుని వెతకడానికి వెళ్లి, ఎట్లాగైతే నేం దాన్ని పట్టుకుని ఊళ్లోకి రాగానే గౌతమబుద్ధుని రాక సంగతి తెలిసి ముఖం కూడా కడుక్కోకుండా గబగబా ఇంటికి చేరి ఎద్దుని కట్టేసి సమావేశ స్థలానికి పరుగు పరుగున చేరాడు.

గౌతమబుద్ధుడు డస్సి ఉన్న ఆ రైతు బిడ్డను చూచాడు. ఆ రైతు బిడ్డలో





జ్ఞానం పట్ల ఎంతో మమకారం, ఉత్సాహం కనబడ్డాయతడికి అతడికి ధర్మదీక్షనిస్తే త్వరలోనే అతడు అర్హుడు కాగలడనిపించిందతడికి. వెంటనే గ్రామ పెద్దను పిలిపించి, ఆ రైతు బిడ్డకి మొదట కడుపునిండా అన్నం పెట్టించి తీసుకురమ్మనమనీ వారు వచ్చేవరకూ ప్రవచనం మొదలు పెట్టననీ చెప్పాడు. ఆ గ్రామ పెద్ద గౌతమ బుద్ధుని ఆదేశాన్ని గొప్ప అను గ్రహంగా తీసుకొని, ఆ రైతుబిడ్డని అప్పటికప్పుడు ఇంటికి తీసుకువెళ్ళి కడుపునిండా భోజనం పెట్టించి, సమావేశ స్థలానికి తీసుకువచ్చాడు.

గౌతమబుద్ధుని ప్రవచనాలను ఆ గ్రామ ప్రజలు ఎంతో శ్రద్ధగా విన్నారు. ఆ రైతుబిడ్డ మరింత శ్రద్ధగా విన్నాడు. బుద్ధుడు ఊహించినట్లుగానే కొద్ది కాలంలోనే బౌద్ధభిక్షువయ్యాడు.

అతడికి అలా శ్రద్ధగా ఆహారం పెట్టించడానికి కారణం అడిగిన మిగిలిన శిష్యులకు గౌతమ బుద్ధుడు ఆకలిబాధ చాలా దారుణమయింది. ఆకలిబాధతో ఉన్న వాడికి వినోదప్రసంగం అయితే కాస్త మరపించగలదు. కానీ, మనం చెప్పేది వినోదప్రసంగం కాదు కదా! జ్ఞానబోధ. ఆకలి అనేది మనిషికి మొండి రోగంలాంటిది. అన్నమనే ఔషధాన్ని అతడు తప్పనిసరిగా తీసుకోవాల్సిందే. జ్ఞానాన్ని పొందడానికి ఆకలి అడ్డురాకూడదు అని చెప్పాడు.

ఈ విధంగా అతడు ఆకలితీర్చుకోవడాన్ని జ్ఞానాన్ని పొందడం కన్నా మొదటిదిగా, ముఖ్యమైనదిగా భావించాడు. మరియెంతో మంది పేదవారు ఉన్నారు. వారందరూ జ్ఞాన సంపన్నులు కావాలంటే వారికి ఆకలి దప్పులు బాధలు ఉండకూడదు. ఎంత కొద్దిగా అయినా సరే వారి ఆకలి దప్పులను పోగొట్టేమార్గమేది?

**బహుశ:** ఈ సంఘటన, ఇటువంటి సంఘటనల వలననే విద్య గరిపేం దుకు నిరాడంబరమైన ఆశ్రమాలు, ఆరామాలు, వసతి గృహాలు కట్టించ డానికి గౌతమబుద్ధుడు అనుమతించాడు. అటువంటి ఆశ్రమాలు విద్యా లయాలై అతి త్వరలోనే ప్రజలు-జ్ఞాన బోధ పొందడంలో, కొందరు అర్హులు కావడంలో మంచి సత్ఫలితాలనిచ్చాయి. దానితో యిలా ఆరామాలు విద్యాలయాలు కట్టించడాన్ని ఎంతో అభినందించాడు. ప్రోత్సహించాడు.

## సాయి సేవక్

# శ్రీ శివనేశన్ స్వామీజీ జీవిత చరిత్ర

**(గత సంచిక తరువాయి)**

స్వామిని బలవంతంగానైనా కల్లూరు తీసుకుపోవలెనని నిశ్చయించుకొని రాత్రులందు స్వామీజీ లెండీబాగ్‌లో ప్రదక్షిణలు చేయు సమయమున బలవంతముగా కారులో తీసుకుపోవాలని కారును లెండీబాగ్‌కు అతి సమీపమున పార్కు చేసి స్వామీజీ రాక కోసం కాపలా కాయసాగారు. భక్తుల మనస్సులను సంపూర్ణంగా అవగతము చేసుకొను శక్తి గల స్వామీజీ ఆ రోజు ప్రదక్షణలకే వెళ్ళకపోగా పది గంటలకే తమ గది తలుపులు వేసుకొని తెల్లవారుఝాము వరకు బయటకు రాలేదు. తెల్లవార్లు స్వామి రాక కోసం నిరీక్షించిన భక్తులు తెల్లవారగనే స్వామీజీని కలువగా స్వామీజీ "రాత్రల్లా నిద్రపోకుండా బాగానే కాపలా కాసారు, రూముకి వెళ్ళి నిద్రపోండి" అన్నారు. స్వామీజీ సర్వజ్ఞతను గాంచిన ఆ భక్తులు ఆశ్చర్యచకితులయ్యారు.

ఒక పర్యాయం ప్రభాకర్, సెక్రటరీ, శ్రీ దత్త వెంకట సాయి సేవా సమాజం, కల్లూరు, వారి స్నేహితులైన తిరుపతయ్యగారితో కారులో షిరిడీకి వెళ్ళి స్వామిని దర్శించగా ప్రభాకర్‌తో స్వామీజీ నీ స్నేహితుని గ్రహబలం బాగోలేదు. అతనిచేత షిరిడీలోగల శని, మారుతీ, ఖండోబా మందిరాలకు, లెండీబాగ్‌లో గల నంద దీపానికి ప్రదక్షిణలు చేయించి తిరుగు ప్రయాణంలో శనిసింగణాపూర్ వెళ్ళి అక్కడ శనీశ్వనకు అభిషేకములు చేయించుకొని కల్లూరు వెళ్ళమని ఆజ్ఞాపించారు. స్వామీజీ చెప్పిన ప్రకారమే చేసి కల్లూరు పరిసర ప్రాంతాలు చేరగనే కారుకు ప్రమాదం సంభవించినది. అందరూ కారులో నుండి దిగగానే కారు పెద్ద లోయలోపడి తునాతునకలైనది. జరగబోయే ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టి రక్షించిన స్వామీజీకి జోహార్లర్పించారు వారందరూ.





అకుంఠిత సాయి భక్తుడు, సాయి నామ సంకీర్తనాభిలాషి, హైదరాబాద్ నివాసి శ్రీ డి.శంకరయ్యగారు ప్రప్రథమంగా షిరిడీ వెళ్ళి ద్వారకామాయిలో స్వామీజీని దర్శించుకున్నారు. రెండవ రోజు కాకడ హారతి ముందే చావడికి వెళ్ళగా అక్కడ స్వామీజీ పద్మాసనములో ధ్యానస్థులై ఉండగా సాష్టాంగ నమస్కారమొనరించి స్వామిని చూడగా ఆయన ఏ ఆధారము లేకుండగా గాలిలో పద్మాశీనులై ఉండుట గాంచి అచ్చెరువొందెను. ఆ లీల స్వామీజీ యోగశక్తిని మనకు తెలియజేయుచున్నది. స్వామీజీకి సాయి నామ సంకీర్తన (ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి)యన్న ప్రాణం. ప్రప్రథమంగా సాయి నామ సప్తాహమును షిరిడీలో లెండీబాగ్ నందు 10.06.1982 నుండి 17.06.1982 వరకు నిర్వహించబడెను. ఈ కార్యక్రమము జరిగిన వారం రోజులు ప్రతి నిత్యం స్వామీజీ ధునిపూజను నిర్వహించెను. ఎచట సాయి సంకీర్తన కార్యక్రమము జరిగినను స్వామీజీ ఊదీ, బాబా తీర్థము మొ॥ ఇచ్చి వారిని ప్రోత్సహించెడివారు. ఈనాడు సాయి నామ సంకీర్తన (ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి) ఏకాహములు, త్రయాహములు, సప్తాహములేగాక అఖండ సాయి సంకీర్తనలు మన దేశమందేగాక విదేశాలలో సహితం జరుగుచున్నవంటే దానికి కారణం మన పూజ్య శివనేశన్ స్వామీజీయే.

చెన్నై నగరానికి చెందిన డా॥ వీరారెడ్డిగారికి స్వామీజీతో మూడున్నర దశాబ్దముల పరిచయ భాగ్యము కలదు. స్వామీజీ నిరాడంబరత, నిస్వార్థ సాయి సేవ, ఖఠోరమైన దినచర్య, కష్టములోనున్న వారిని ఆదుకునే దయార్ద్ర హృదయము వీరారెడ్డిగారిని ఎంతగానో ఆకర్షించినది.

అనేకమంది భక్తులు స్వామీజీ చెంతకు వచ్చి తమ బాధలు తెలుపుకొనగా కొందరిని ద్వారకామాయిలో పారాయణ చేయమనియు, మరి కొందరిని ధుని పూజ చేయమనియు, ఇంకొందరిని హనుమాన్ చాలీసా పఠించమనియు, గురుస్థాన్, నంద దీపము, దత్త మందిరములకు

ప్రదక్షిణలు చేయమని మరికొందరికి, అన్నదానము చేయమని కొందరికీ చెప్పట గాంచి వీరారెడ్డిగారు విస్మయమొందిరి. స్వామీజీ సలహాను పాటించి బాధావిముక్తులైన వారి సంఖ్య అసంఖ్యాకము.

ఇదంతయు కనులారా గాంచిన వీరారెడ్డిగార్కి స్వామీజీకి ఇంతటి శక్తి ఎలా ప్రాప్తించినది అవగతము కాలేదు. ఒక పర్యాయం స్వామీజీ చావడిలో భక్తులకు సాయిలీలలు వివరించుచుండగా స్వామీజీ శిరము పైభాగమున గల బాబా చిత్రము నుండి కాంతిపుంజమొకటి ఆ ప్రదేశ మంతా కాంతులు విరజిమ్ముతూ స్వామిలో లీనమగుట వీరారెడ్డిగారు గమనించారు. స్వామీజీ ద్వారా బాబా ఇవన్నియు తన భక్తులకు అందించు చున్నారని గ్రహించి స్వామి మహిమను తెలుసుకుని ఆనందభరితుడాయెను.

**భక్తుల అనుభవాలు, అనుభూతులు :**

హైదరాబాద్ శ్రీనగర్ కాలనీ వాసులైన కె.రామరత్నంగారు స్వామీజీ గురుకులంలో జరిగిన ఒక కార్యక్రమమును కుటుంబసమేతముగా షిరిడీ వెళ్ళి సాయి సంజీవని హోటల్‌నందు బసచేసెను. ఆ రోజు ఉదయమే గం.6.00లకు కాలకృత్యములు తీర్చుకొని గురుకులమునకు బయలు దేరుటకు గది నుండి బయటకు వచ్చి హోటల్ రిసెప్షన్‌లో గల సోఫాలో కొంత తడవు విశ్రమించి గం.6.30 ని.లకు గురుకులమందు జరిగెడి కార్యక్రమమునకు బయలుదేరి వెళ్ళెను. ఆ హడావిడిలో రూ.25,000/- నగదు, సాయి సచ్చరిత, బాబా అష్టోత్తర శతనామావళి పుస్తకములు, తులసీదాస్ విరచితమైన హనుమాన్ చాలీసా పుస్తకములు గల బ్యాగ్‌ను సోఫాలోనే మరచిపోయెను. సుమారు గం.11.30 ని.ల సమయమున వారి మనుమడు బ్యాగ్ సంగతి గుర్తుచేయగా రామరత్నంగారు దానిని హోటల్ సోఫాలో మర్చిపోయినట్లు గుర్తు తెచ్చుకుని వెంటనే ఆటోలో హోటల్‌కు రాగా ఆ బ్యాగ్ పెట్టినచోటనే ఉన్నది. ఎవ్వరూ దానిని గమ నించలేదు. బ్యాగ్‌లోని నగదు, పుస్తకములు అన్ని యధాతథంగా ఉన్నాయి.


**(సశేషం)**






# శ్రీ సాయి నిత్య పారాయణ గ్రంథము

## భక్తి పద్య కావ్యము




రచన : "రంగరాయ" బిరుదాంకిత **శ్రీ మండువ రంగారావు**

ఆ.వె. పట్టు బట్టి నీవు ప్రజల సేవలు జేయ
ఫలిత మెంచకుండ పాటుబడగ
పట్టుపడును సాయి పరమ సాధువతడు
నిన్ను వదల డెపుడు నిక్క మిదియ 10



## 5. వసుధ నుద్ధరించ



సీ. వసుధను కాపాడ వరహావతారము
రక్కసు పరిమార్చ రావె నీవు
ప్రహ్లాదుఁ గావంగ భవన కంభమునందు
యుద్భవించితివట ఉగ్రరూప
కూర్మావతారాన కొండమోసితివట
దేవతలను బ్రోవ దేవివైతి
రామావతారాన రావణు వధియించి
ధర్మమూర్తిగ నీవు ధరణినేల

తే.గీ. ఎన్ని అవతార జన్మలో ఎవరి కెఱుక
ఆర్త జనముల కష్టాలు ఆదు కొనగ
కలియుగము నందు మాలోన యొకడి వైతి
మమ్ము దరిజేర్చగా సాయి మార్గదర్శి .... 1

ఆ.వె. పుణ్య నదులు బారు పుణ్యభూమి యిదియ
కర్మభూమి - పనులఁ గాంచగాను
దేవభూమి యయ్యె దేవుడే జనియించ
భరత భూమి మనకు భాగ్య సీమ .... 2

తే.గీ. రామ కృష్ణులు నడయాడ రమ్యభూమి
తాపసుల తపో భూమిది ధన్యభూమి
పాడి పంటల సంమృద్ధి పాటి నేల
గంగ యమునలు పారెడు కాంచనంబు .... 3

తే.గీ. భరత దేశము ఆనాడు భవ్యసీమ
అన్ని రంగము లందున ఆరితేరి
కూడు గుడ్డలకేనాడు కొదువ లేక
సర్వ సమృద్ధి గలిగిన స్వర్గ సీమ ... 4

తే.గీ. బయటి దేశాల వారలు వలస వచ్చి
భరత సంపద భక్షించు భావ మలర
వేయి వత్సరములిచట వేసియుండి
వలసి నంతగ పిండిరి వరుసగాను ... 5

ఆ.వె. శమము దమము మరచె శౌర్యంబు క్షీణించె
వేయి వత్సరాల వెతల వలన
కులము మతము జాతి కుత్సిత మదియున్న
పెచ్చు పెరిగి పోయె పేద దనము .... 6

తే.గీ. శమ దమాదులు నేర్వంగ శక్తి నొసగి
బానిసత్వ భావములను బాపు కొఱకు
భరత జాతిని మేల్కొల్పి భవిత జూప
సాయి శిరిడీన వెలసిన సద్గురుండు ... 7






తే.గీ. జాతి మతముల పోర్ద్రోలి జనుల జేర్చి
మానవత్వము నేర్పించె మాన్యులవగ
పరహితము బోధ జేయుచు బరగె సాయి
శిరిడి గ్రామాన నాతడు శివుడివోలె.... 8

కం. భిక్షాటనము నిరతము
ప్రక్షాళన జేసి వారి పాపము లెల్లన్
రక్షించెను సాయీశుడు
అక్షయముగ నమ్మినోల్ల ననవరతముగాన్. 9

కం. సాయము కోరిన యొసగెను
యీయననక నిచ్చె తాను ఈప్సిత మెల్లన్.
సాయిని కొలిసిన ప్రాణులు
కాయముతో దివికినేగె కాలము రాగాన్ .... 10


కం. శ్రద్ధయు భక్తియు పెనువడ
యిద్ధరణిన సాయినాథు యిమ్ముగఁ బిలువన్
కద్దట వేగమె వచ్చుట
ముద్దుగ నీకోర్కె దీర్చ మురిపెము తోడన్.. 11

**(సశేషం)**



**ఇతరుల మీద కోపతాపాలు ప్రకటించి కఠినంగా మాట్లాడవద్దు. ఎవరి తోనూ కలహం వద్దు. ఇతరులు నిన్ను నిందిస్తే ఓర్పుతో శాంతి వచనాలు పలుకు. ఇదే సుఖప్రాప్తికి మార్గం. ప్రపంచం తలక్రిందులైనా సరే ముక్కుకు సూటిగా నీ మార్గంలోనే నీవు నడుస్తూ ఉండు.**

**- బాబా**



# సాయిభక్త దాసగణు

రచన : విజయ కిషోర్

(గత సంచిక తరువాయి)

బాబా సంకల్పానుసారంగా లభించిన ఆ సత్పురుషుని సహవాసం వలన, దాసగణులో ధార్మిక ప్రవృత్తి వృద్ధిచెంది తనలోని తామసిక వాసనలపై విజయం సాధించేందుకు దోహదం చేసింది. ఒకసారి దాసగణు స్టేషనులోని ఉద్యోగులందరి జీతం డబ్బులను ఒక సంచిలో పెట్టుకుని తీసుకు వస్తుండగా, దారిలో శ్రీరామయ్య ఎదురుపడ్డారు. "గణపతి, ఆ సంచిలో ఏమున్నాయి?" అని అడిగారు. దాసగణు సమాధానం చెప్పేలోపే "ఆ సంచీని నాకిచ్చేయ్" అని అంటూ, దాసగణు చేతిలోని సంచీని తటాలున లాక్కొని పరుగెత్తి క్షణాలలో కనిపించకుండాపోయారు. సమయంలోగా ఆ డబ్బులను స్టేషనుకు చేర్చకపోయినా, అసలు సంచీ పోయిందనే విషయం పై అధికారులకు తెలిసినా, తనపై అబద్ధపు అభియోగాలు మోపి, ఉద్యోగాన్నుండి తొలగించే ప్రమాదం ఉంది. దాసగణుకు ఏం చేయాలో పాలుపోలేదు. చివరకు బాబాకు శరణుచెందడం మినహా ఇంకో మార్గం కనపడలేదు. "బాబా మీరే నన్ను ఈ సంకటం నుండి గట్టెక్కించాలి. మీరు చెప్పినట్లే వింటాను" అని మనస్ఫూర్తిగా ప్రార్థించాడు. అలా ప్రార్థించిన కొన్ని క్షణాల తరువాత రామయ్య వచ్చి ఎదురుగా నిలబడి, "ఇదిగో గణపతి నీ సంచి" అని చెప్పి వెంటనే అక్కడ నుండి నిష్క్రమించారు. బ్రతుకు జీవుడా అంటూ, వెంటనే వెళ్ళి ఆ డబ్బులను జమచేసి, ఆ సంకటం నుండి దాసగణు బయటపడ్డాడు.

నిజానికి రామయ్య చేసింది, బాహ్యంగా మతిభ్రమణంతో చేసినట్లుగా మనకు అ(క)నిపించినా, "ఇదంతా నీకు అనవసరం. నీవు చేయవలసినది ఇది కాదు. బాబా చెప్పినట్లుగా నీవు గొప్ప పారమార్థిక కార్యంలో నిమగ్నం కావాలి" అనే నిగూఢమైన బోధ ఆ కృతిలో అంతర్లీనమైయుందని





మనకు అవగతమవుతుంది. కారణం, మహాత్ములందరూ భక్తుడు పారమార్థికంగా పురోగమించాలని, తాము పొందిన ఆ ఆనందాన్నే వారు పొందాలని సదా పరితపిస్తూ ఉంటారు. అందులోను దాసగణు పారమార్థిక పురోగమనం ఎందరో భావిక భక్తుల పారమార్థిక పురోగమనంతో ముడిపడియుంది. అంటే, బాబాతో ఋణానుబంధంతో బంధించబడియున్న ఎందరో భక్తులను బాబా వద్దకు తీసుకువచ్చే గురుతర బాధ్యతను కలిగియున్న దాసగణు విషయంలో మాహాత్ములు అటువంటి ప్రత్యేక శ్రద్ధ మరియు కలవరం చూపడం సహజమే కదా! దాసగణు బాబాను ప్రార్థించిన కొన్ని క్షణాలలోనే రామయ్య సంచీతోసహా ముందు నిలబడటం చూస్తే, దాసగణు యొక్క ప్రతి ప్రార్థనను బాబా మన్నిస్తూనే, తనను తమ దారికి తెచ్చుకుంటున్న అపూర్వమైన రీతి మనకు ద్యోతకమవుతుంది. అంతేకాదు, నా భక్తుడు అడిగినవన్నీ ఇస్తూనే ఉంటాను. నేను ఇవ్వాలనుకున్నది వారు అడిగేంతవరకు అనే బాబా వాగ్దానంలోని సూక్ష్మం విశదమవుతుంది.

**మూడవ సంకటం :** దాసగణు తన చివరి తమాషా ప్రదర్శనను మోహినీ రాజ్ దేవాలయంలో ప్రదర్శించి, తమాషాలకు శాశ్వతంగా స్వస్తి పలికాడని మనం ముందర చెప్పుకున్నాం. అప్పుడు నెవాసా గ్రామస్తులు కొందరు, పవిత్ర దేవాలయంలో శృంగారభరిత తమాషా ప్రదర్శన చేసి ఆలయాన్ని అపవిత్రం చేసాడని దాసగణుపై న్యాయస్థానంలో వాజ్యం వేసారు. న్యాయస్థానంలో వాజ్యం ఋజువైతే, ఉద్యోగానికి ప్రమాదం తప్పదు. విచారణ జరిగే రోజు దగ్గర పడుతుండటంతో దాసగణులో ఆందోళన పెరగసాగింది. చివరకు ఆ రోజు రానే వచ్చింది. దాసగణు బాబా చిత్రపటం ముందు మోకరిల్లి "బాబా, నేను తమాషాలను వదిలే క్రమంలో, ఒక విశిష్ట కారణంతో మోహినీరాజ్ మందిరంలో తమాషాను ప్రదర్శించాను. దయచేసి మీరే నన్ను కాపాడండి. మీ మాటే నాకు శిరోధార్యం" అని మొక్కుకొని న్యాయస్థానానికి వెళ్ళాడు. అక్కడ మేజిస్ట్రేట్‌కు సంజాయిషీ ఇస్తూ

"నేను కూడా బ్రాహ్మణుడినే! దేవాలయాన్ని అపవిత్రం చేయాలనే ఉద్దేశ్యం నాకు లేదు. క్షవరం చేయించుకుంటే స్నానం చేయనిదే పూజాగదిలోనికి అడుగుబెట్టరు. కానీ, మ్రొక్కు తీర్చుకునే ప్రక్రియలో భాగంగా, అదే క్షవరాన్ని దేవాలయంలో చేయించుకుంటారు కదా! అప్పుడు ఆ క్షవరాన్ని అపవిత్రంగా భావించరు. అలాగే, మ్రొక్కు తీర్చుకునేందుకు నేను చేసిన తమాషా ప్రదర్శన కూడా అపవిత్రం క్రిందకు రాదు. అయినా నేనేమి దత్తాత్రేయుని ముందో, శంకరుని ముందో, విఠోభా ముందో తమాషా ప్రదర్శన చేయలేదు. స్వయంగా స్త్రీ వేషం వేసి నర్తించిన మోహినీరాజ్ ముందు వేసాను" అని తన వాదనను గట్టిగా సమర్థించుకున్నాడు. దాసగణు వాదనతో మేజిస్ట్రేట్ సంతృప్తి చెంది, వాజ్యాన్ని కొట్టివేసారు. కానీ, పై రెండు సంకటాలు తొలగిన సందర్భాలలో ఉద్యోగాన్ని వదిలేసే విషయాన్ని మాత్రం దాసగణు ప్రక్కనబెట్టాడు.

**నాల్గవ సంకటం :** దాసగణుచే ఉద్యోగం వదిలించే ప్రక్రియలో బాబా కేవలం సంకటాలు మాత్రమే కల్పించలేదు. ఒక్కొక్క సంకటంలో పరోక్షంగా తమదైన శైలిలో పారమార్థికంగా పొందే అమోఘమైన ఆనందం ముందు ప్రాపంచిక ఆనందాలు తుచ్ఛం అనే సత్యాన్ని బోధిస్తూనే ఉన్నారు. ఆ భావం తనలో బలపడేటట్లు చేసారు. తాము కోరుకునే మార్పు సద్భక్తునిలో కొని వచ్చే ప్రక్రియలో ఒక గజదొంగను పాత్రధారిని చేసిన వైనం, దాసగణు జీవితంలో ద్యోతకమవుతుంది. దాసగణు పారమార్థిక ప్రవాసంలో మేలి మలుపుగా, దాసగణులో నిద్రాణమైయున్న ఉన్నత సంస్కారాల మేలుకొలుపుగా ఈ ప్రకరణాన్ని అభివర్ణించవచ్చు. దాసగణు జీవన గ్రంథంలో సద్గురు కృపాసౌగంధికమైన ఈ ప్రకరణాన్ని కొంచెం విస్తారంగా విపులీకరించక తప్పదు. సావధానచిత్తులై ఈ ప్రకరణంలోని మాధుర్యాన్ని గ్రోలేందుకు ఉద్యుక్తులు గావలసిందిగా పాఠకులకు మనవి. వివరాలలోకి వెళితే ...

ఆ రోజులలో లోణి పర్వతశ్రేణులలో కాణ్హాభిల్ అనే గజదొంగ ఉండేవాడు.

(సశేషం)





శ్రీ కృష్ణావతారం

# శాశ్వత ధర్మగోప్త



- రచన : భండారు సదాశివరావుగారు

(గత సంచిక తరువాయి)

అని క్షణం ఆగి 'కృష్ణా! కాలప్రభావం వల్ల అక్కడ ఇప్పుడు నరకాసురుడనే నిరంకుశుని రాజ్యశాసనం నడుస్తున్నది. అతనిది ఆసురీ ప్రవృత్తి. ఆ భవ్యతీర్థం ఇప్పుడు సాక్షాత్తు నరకంగా మారింది.

మధ్యలో మరో శ్రోత్రియుడు ఓపిక పట్టలేక ఉద్వేగంతో 'అయ్యా! అతడు చుట్టూ ఉన్న చిన్న చిన్న రాజులను ఓడించి, ఓడించిన వాళ్లను చంపి, వారి అంతఃపుర స్త్రీలను చెరబట్టి తెచ్చాడు. గ్రామాలలో జొరబడి గోవులను అపహరించి తెచ్చి, వాటిని వధించి ఆ మాంసాన్ని విక్రయింపజేస్తున్నాడు. గురుకులాలను, శ్రోత్రియ నివాసాలను కూడా పూర్తిగా నాశనం చేసి, యజ్ఞయాగాదులను, వైదికకర్మలను నిషేధించాడు. మా ఇంటి స్త్రీలను కూడా చెరబట్టాడు. ప్రస్తుతం వాని చెరలో పదహారు వేల మంది కులీన స్త్రీలు కుమిలిపోతున్నారు' అన్నాడు.

'మరి, చుట్టూ ఉన్న రాజులేమి చేస్తున్నారు?"

'ఏమి చెప్పమంటారు మహానుభావా! అతని రాజ్యం దుర్గమములైన కొండల మధ్య విస్తరించి ఉంది. ఎత్తైన శిఖరాలతో, లోతైన లోయలతో, దుందుడుకుగా, వేగంగా ప్రవహించే వాగులతో, చిన్న చిన్న నదులతో ఎంతటి సాహసికైనా తేలికగా చొరరానిదది'.

కృష్ణునికి జిజ్ఞాస పెరిగింది.

'అతని బలం అంతా ఆ కొండలు, ఆ లోయలు, ఆ నదులే. ప్రాగ్జ్యోతిషం చుట్టూ ఒక మహాపరిఖను నిర్మింపజేశాడు. అది మొసళ్లకు నిలయం. దానిలో చిక్కుబడితే బ్రతకడం అసాధ్యం. ఆ అగడ్తను దాటి లోపలికి

ప్రవేశించడానికి రెండే దారులు. ఒకటి పెద్ద బల్లపలకలతో చేసిన వంతెన. దానిని ఏనుగులను, బండ్లను, మిగతా పశువులను దాటించడానికి రోజుకు ఉదయం ఒకసారి, సాయంత్రం ఒకసారి ఉపయోగిస్తారు. అదీ కొన్ని ఘడియలే. తరువాత దాన్ని తొలగిస్తారు. రెండవది చిన్న పలకల వంతెన. అవసరాన్ని బట్టి మనుష్యుల రాకపోకలకు ఉపయోగించేది. దానిని కూడా అధికారుల అనుమతితోనే ఉపయోగిస్తారు'.

'అయితే అతనికి అశ్వదళం, రథాలు లేవా?' కృష్ణుడు అడిగాడు.

'అతనికి అశ్వదళం లేదు. రథాలు కూడా ఎక్కువ లేవు. రథాలను నడిపించేదారులు లేవు. కొన్ని ఏనుగులున్నాయి. పోగా ఆ అగడ్తలను రక్షించడానికి, రాకపోకలను నియమించడానికి మురాసురుడనే అధికారి ఉన్నాడు. అతడు రాక్షసబలుడు. రాకపోకల సమయాలలో అతని పుత్రులు, అనుచరులు ఎంతో అప్రమత్తంగా ఉంటారు. సాయుధులై ఇతరులు ఎవ్వరూ లోనికి ప్రవేశించనేలేరు'.

ఆ వృద్ధ శ్రోత్రియులు కల్పించుకొని, 'కృష్ణా! అతని వాహనం ఒక మత్త గజం. దాని పేరు సుప్రతీక. ఆ కొండలలో, అడవుల్లో అది అతి భయం కరంగా వర్తిస్తుంది. హయగ్రీవ నిశుంభులు అతని సేనాపతులు, ఆ అసమ క్షేత్రంలో ఛద్మయుద్ధం నడపడంలో ప్రవీణులు. వారిద్దరు తమ సిబ్బందితో నగరం చుట్టూ ఉన్న కొండదారులను, లోయబాటలను రక్షిస్తుంటారు' అన్నారు.

'మరి చెరబట్టిన ఆడు వారి గతి?' కృష్ణుడడిగాడు.

'వాసుదేవా! అదొక విషాదగాథ ప్రభూ! ఆ నగరం ప్రక్కనే లోహిత నది ప్రవహిస్తుంది. దాని తీరాన అపహృత స్త్రీలకు నివాసాలు కల్పించారు. తన అంతఃపురంలో, రాజోద్యోగుల ఇండ్లలో, అధికారుల నివాసాలలో, నగరంలోని ప్రముఖుల ఇండ్లలో వారిని సేవకురాండ్రుగా ఉపయోగిస్తుం టారు. వాళ్ళందరూ కట్టుబానిసలు. వారి వ్యవహారం చూడడానికి, పంచ





జనుడనీ, విరూపాక్షుడనీ, ఇద్దరు రాక్షసాధికారులున్నారు'.

మరో శ్రోత్రియుడు కన్నీటిని తుడుచుకుంటూ 'వాసుదేవ ప్రభూ! నా కూతురు అపహరింపబడి పదేండ్లైంది. ఇప్పుడామె వయసు ఇరవదెనిమి దేండ్లు. ఏడాదికి ఒకసారి లేదా రెండుసార్లు చూడటానికి వీలవుతున్నది' అని గద్గదంగా అని 'అదీ అతని తల్లి దయవల్ల' అన్నాడు.

'అతని తల్లి దయవల్లనా? ఆమె ....'

ఉపమన్యుల వారు కృష్ణుని చూస్తూ 'వాసుదేవా! ఆమె పేరు భూదేవి. భర్త సజ్జన హృదయవల్లభుడే. కాని వీడు వారి కడుపున చెడబుట్టిన రాక్షసుడు. ఆ భూదేవి కూడా నరకుని దురాగతాలకు క్షోభిస్తూనే ఉంటుందయ్యా! ఈ బాధలు తప్పించమని పరమేశ్వరుని ప్రార్థిస్తుంటుంది. ఈ శ్రోత్రియులు, తాపసులు ఆమెనే ఆశ్రయించారు. ఆమె జోక్యంతో అపహృత స్త్రీల తల్లిదండ్రులకు తమ తమ ఆడబిడ్డలను చూడటానికి అనుమతిస్తున్నాడు. అదీ అప్పుడప్పుడే. కృష్ణా! వాడు త్రివిష్టపం మీదికే దాడి చేసాడు. పూజ్యులు కశ్యపుల పత్ని, లోక జనని అదితి మణికుండలాలను అపహరించాడు. త్రివిష్టపాధిపతి సంహాసనానికి అచ్ఛాదనగా అమర్చిన వరుణచ్ఛత్రాన్ని అపహరించాడు' అని చెప్పి 'చిత్రవాహనుడనే వీరుడు ఆ పరిసరాల నున్న మణిపుర రాజ్యానికి అధిపతి. అతడు కూడా నరకుని దొంగచాటు దాడులకు విసిగిపోయినాడు. ఎన్నోమార్లు వీని అనుచరులు చిత్రవాహనుని గ్రామాల్లో చొరబడి ఆవులను దొంగిలించారు. చివరకు ఆ రాజు విసిగి నరకునితో సంధి చేసుకున్నాడు' అని వివరించి 'మరో ప్రమాదవార్త ఈ మధ్యనే వినవచ్చింది కృష్ణా, అతని చారులను పంపి మగధ సామ్రాట్టు జరాసంధుణ్ణి హస్తినాపుర యువరాజు దుర్యోధనుణ్ణి కలుసుకొని ఒక కూటమిగా రూపొందడానికి మంతనాలు సాగించాడట. నరకుని కుమారుడు భగదత్తుడు. అతనికి దుర్యోధనునితో స్నేహం ఉన్నదంటారు'. **(సశేషం)**

# మాతృసంస్థ కబుర్లు

నవంబర్ 28 ఆదివారం సెలవుదినం. కార్తీకమాసం కావడంతో సాయిధామం ఆశ్రమంలో యోగాచార్య మాధవ్‌గారు, వారి శిష్యులు వన భోజనాలకు వచ్చేశారు. ఆశ్రమ వాతావరణం ఎంతో బాగా నచ్చిందని చెప్పారు. పూజ్య స్వామీజీ వారికి అనుగ్రహభాషణం కావాలని కోరగా శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీవారు మన భారతీయ ఆచార, సాంప్రదాయాల గురించి, తల్లిదండ్రులు పిల్లలకు నేర్పాల్సిన పద్ధతులను వివరించారు.

డిసెంబర్ 3వ తేదీన మూడు చింతలపల్లి గ్రామ వాస్తవ్యులు శ్రీ సదాశివ రెడ్డిగారి ఆహ్వానం మేరకు వారి గృహంలో రుద్రాభిషేక మహోత్సవము సందర్భముగా శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీవారు శివతత్వాన్ని గూర్చి ప్రవచించారు.

దత్త యజ్ఞానికి 11 రోజుల ముందు నుంచి "సాయి దీక్షా" కార్యక్రమాన్ని పూజ్య గురుదేవులు ప్రారంభించారు. దీనిలో సాయి విద్యాధామం పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు, పూర్వ విద్యార్థి, ఆశ్రమ భక్తులు మొత్తం 30 మంది దీక్షాధారణ చేసారు.

11 రోజులపాటు ఈ 30 మందికి కావలసిన అన్ని సౌకర్యాలు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారే సాయిధామం ఆశ్రమంలో ఏర్పాటు చేశారు. ప్రతిరోజు పిల్లల్లో లోపించిన క్రమశిక్షణ, నైతిక విలువలు, ఆధ్యాత్మికత మొదలైన విషయాల పట్ల ఉత్సాహాన్ని కలిగించారు. శరీర ధారుఢ్యానికి కావలసిన యోగా, ధ్యానం, జపం మొదలైన వాటిలో శిక్షణ ఇచ్చారు.

14వ తేదీ భవానీనగర్, తాళ్లబస్తీ, కవాడిగూడ, హైదరాబాద్‌లలో శ్రీశ్రీశ్రీ మారెమ్మ, పోచమ్మ దేవాలయం విగ్రహ ప్రతిష్ఠాపనా మహోత్సవం, మారెమ్మ-పోచమ్మల విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామా





నంద ప్రభుజీ వారి కరకమలములతో జరిగినది. అనంతరం స్వామీజీ భక్తులనుద్దేశించి దేవాలయ ప్రాశస్త్యాన్ని గురించి, దేవాలయం సంస్కార కేంద్రం అని, హిందూ దేవాలయాలకు ఎందుకు అంత గొప్ప తనాన్ని మన పెద్దలు పెట్టారో వివరించారు. దేవాలయాన్ని ఏ విధంగా తీర్చుదిద్దుకోవాలో, కాపాడుకోవాలో వివరించారు.

14వ తేదీ మధ్యాహ్నం గం.2.00లకు ఎల్.బి.స్టేడియంలో లక్ష యుగళ గీతార్చనా సందర్భంగా శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీవారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇరవై నాలుగు వేల మంది పాల్గొన్నారు.

శ్రీ దత్తాత్రేయ జయంతిని మార్గశిర శుక్ల పౌర్ణమినాడు జరుపుకుంటారు. త్రిమూర్తులు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల అవతారమైన దైవ స్వరూపులు "దత్త" అనే పదానికి "సమర్పించిన" అనే అర్థముంది. త్రిమూర్తులు అత్రి మహర్షి మరియు అనసూయ దంపతులకు పుత్రుడి రూపంలో తమను తాము సమర్పించుకున్నారు. కనుక అతనికి దత్తా అని పేరు వచ్చినది.

**స్వస్తిశ్రీ ప్లవ నామ సంవత్సర మార్గశిర శుద్ధ పౌర్ణమి 18.12.2021న సాయిధామం సేవాశ్రమంలో చతుర్థ అష్టోత్తర శత కుండాత్మక ఏకాహ్నికా శ్రీ దత్త శక్తి మహాయాగము జరుపుటకు సంకల్పించడమైనది.**

ఈ మహా యజ్ఞానికి ఏర్పాట్లు నెల నుండే మొదలయినాయి. ఈసారి దత్తాత్రేయుల వారు ఓ పరీక్ష పెట్టారు. పాఠశాల విద్యార్థులు, టీచర్లు కార్యకర్తలుగా లేకుండా ఎస్.ఎ.-1 పరీక్షలు పెట్టారు. అయినా సరే, కించిత్తు కూడా యిబ్బంది లేకుండా కుండాల నిర్మాణానికి ముగ్గు పోయడం, కుండల నిర్మాణం, అలకడం, ముగ్గు పెట్టడం మొదలైనవన్నీ సాయి విద్యాధామం చిన్న వానరులు చిట్టి చిట్టి చేతులతో ఎంతో ఉత్సాహంగా అలకడం, మొదలైన పనులలో పాల్గొన్నారు. సాయిధామానికి చుట్టుప్రక్కల ఉన్న గ్రామప్రజలు ఈ దత్త యజ్ఞంలో పాల్గొని వారికి మంచి జరగాలనే ఉద్దేశ్యంతో శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారు మూడు రోజుల పాటు ఆటోలో మైకు పెట్టించి యజ్ఞ విశిష్టతను ప్రచారం చేయించారు.

280 మంది భక్తులు ఈ దత్త మహాయజ్ఞంలో పాల్గొన్నారు.

సమయం దగ్గర పడుతున్న కొద్దీ ఆందోళన. సమయానికి అన్ని పనులు అవుతాయో లేదోనని. రేపల్లె, తెనాలి, సత్తెనపల్లి, సిటీల నుంచి భక్తులు రెండు రోజుల ముందు నుంచే వచ్చి కార్యకర్తలుగా మంచి సహకారాన్ని అందించారు. యజ్ఞానికి ముందు రోజు జెండాలు కట్టడం, యాగశాల అలంకరణ, స్టేజి ఏర్పాట్లు, యజ్ఞ సామాగ్రి సిద్ధం చేసుకోవడం, చిన్నా, పెద్ద తేడా లేకుండా, రాత్రి నిద్ర లేకుండా చలిలోనే యజ్ఞానికి అన్నీ సిద్ధమైనాయి.

18వ తేదీ రానే వచ్చింది. ఉదయం గం.6.00లకే హడావిడి మొదలయ్యింది. శ్రీ త్రిగుళ్ళ మాధవ శర్మగారి శిష్య బృందం గం.8.00ల కల్లా విచ్చేసారు. గం.10.00లకు శ్రీ దత్తాత్రేయుల వారికి షోడశోపచార పూజ జరిగాయి. గం.11.00లకు యాగశాల ప్రాంగణమంతా వేద మంత్రాలతో, పుణ్య పురుషులతో పునీతమైంది. బ్రహ్మశ్రీ త్రిగుళ్ళ మాధవశర్మగారి ఆధ్వర్యంలో శ్రీ విఘ్నేశ్వర పూజ, స్వస్తి వాచనము, అఖండ దీప స్థాపనము, శ్రీ గురుపూజ, గోపూజ, దీక్షా ధారణ జరిగాయి.

గం.12.00లకు యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠాపనా కార్యక్రమం ప్రారంభమైంది. మొదటగా గణపతి హోమము, నవగ్రహ హోమము, శాస్త్ర వివరణ ఇస్తూ, మధ్య మధ్యలో భజనలు చేస్తూ, ఎంతో చక్కగా నిర్వహించారు. శ్రీ దత్తాత్రేయ మూల మంత్ర గాయత్రీ హోమం, దిక్పాలక బలి, యాజ్ఞికుల స్వాహాకారాలతో యాగశాల పవిత్రమైనది. వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా మధ్యాహ్నం గం.3.00ల వరకు యజ్ఞంలో పాల్గొన్నారు.

మధ్యాహ్నం గం.1.00లకు శ్రీశ్రీశ్రీ మాతా నిర్మలానంద యోగ భారతిగారి అనుగ్రహ భాషణం - ఈ భారతదేశంలో వేదం చదివిన బ్రాహ్మణులు ఉండటం, సత్ సంకల్పం చేసే సాధు పుంగవులు ఉండటం, ఎంత వరకు ఈ పరంపర ఉంటుందో, అంతవరకు దేశ సౌభాగ్యానికి హాని కలగదు. ఈ పరంపరను కాపాడుకోవడం మనందరి కర్తవ్యం. ప్రతి





తల్లిదండ్రికి వారి వారసత్వం గొప్పవారు కావాలని ఉంటుంది. అందరికీ తమ వంశంలో గొప్ప స్థితిపొందే సంతానం కావాలని ఉంటుంది. ప్రతి భార్య తన భర్త చాలా మంచివాడు కావాలని కోరుకుంటుంది. ప్రతి భర్త తన భార్య మంచి వ్యవహారత దక్షత ఉండాలని కోరుకుంటాడు. ఈవన్నీ ఎలా జరుగుతాయంటే మంచి పరంపర కొనసాగినప్పుడే. ఈనాడు చెడు వార్తలు చెప్పే మీడియా చాలా వుంది. మన దగ్గర మంచి వార్త ఇచ్చేటు వంటి సంస్కారం యిచ్చేటటువంటి వ్యవస్థనే లేకుంటే ఈ రోజు ఈ మీడియాకు ఆహుతి అయిపోతుంది సమాజం. ఎక్కడ చూసినా కుట్రలు, కుతంత్రాలు, మోసాలు, విరోధం, చెడుకు విచ్చలవిడితనం ఈ భయంకరమైన స్థితి లోపల ఈ దత్తయజ్ఞం లాంటి మహాకార్యాలు జరగడం ఎంత పుణ్యం. ఎక్కడ స్వాహాకారాలు జరుగుతాయో అక్కడ దేవతలు ప్రసన్నులై నాట్యం చేస్తారు. ఒక్క యజ్ఞమే సమస్త దేవకోటికి ప్రసన్నతను ఇవ్వగలిగేది. ప్రాచీనకాలంలో మన సంస్కృతికి రెండే ముఖ్యమైన గ్రంథాలు. 1) యోగము, 2) యజ్ఞము. యోగము ద్వారా మన మనస్సు, బుద్ధి, ఆత్మ వరకు శుద్ధి జరుగుతుంది. కానీ, యజ్ఞంలో శరీరము, ప్రకృతి రెండు శుద్ధి అవుతాయి. ప్రకృతి వికారం పొందితే రోగాలే తాండవిస్తాయి. కానీ, ఆరోగ్యం రాదు, ఆరోగ్యం లేని వ్యక్తి ఏ పని చేయగలుగుతాడు. ఈ భూమిపై మానవుడు ఆత్మ కళ్యాణం కొరకు వచ్చాడు. కానీ ఎలా చేసుకోగలడు.

మన చరిత్రకు సంబంధించిన చరిత్రలు పెద్దలుగా మీరు చదవడం, మీ పిల్లలకు చెప్పండి. మన సంస్కృతి, ధర్మాన్ని కాపాడండి" అని బోధించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం జరిగింది. దీక్షాధారులకు ఆశీర్వచనం, అనంతరం యజ్ఞం చేసుకున్న వారందరికీ ఆశ్రమం తరపున క్యాలెండర్, భగవద్గీత పుస్తకం, లడ్డూ ప్రసాదం, సాయివాణి ఇవ్వడం జరిగింది.

అనంతరం సాయిదత్త పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వామి శ్రీరామానంద ప్రభుజీ వారు భక్తులనుద్దేశించి ఇది సాయిదత్త పీఠం-దీన్ని ఏర్పాటు చేస్తున్నప్పుడు ఒక భక్తుడు అడిగాడు. స్వామీ దత్త పీఠం నెలకొల్పుతున్నారు

ఏ ఉద్దేశంతో అని అడిగినప్పుడు స్వామీజీ సమాజంలో మన సంప్రదాయాలు, విలువలు మరుగున పడుతున్న తరుణంలో సమాజాన్ని ఉద్ధరణ చేయాలంటే ఒక ఆశ్రమం ద్వారానే చేయగలం, సమాజంలో ధర్మానికి రక్షణ లేకుండా పోయింది. మనందరం భగవంతుని ముందు నిలబడి స్వామీ దుష్ట సంహారం చేయండి, శిష్ట రక్షణ చేయండి అని ప్రార్థన చేస్తే భగవంతుడు దుర్మార్గులంతా ఒకవైపు, సన్మార్గులంతా ఒకవైపు నిలబడండి అంటే రెండు లైన్లు లేవని అనుకుంటాను. ఒకవైపు అది అందరమూ దుర్మార్గులవైపే ఉంటాము అందరు కూడా. అసత్యం ఆడటం, అసత్యంగా ప్రచారం చేయడం, అధర్మాచరణ చేయడం, మనసా, వాచా, కర్మణ ఏదో ఒక తప్పిదాన్ని చేసే ఉంటాం. కాబట్టి మనమంతా దుష్టత్వం వైపు నిలబడాల్సి వస్తుంది. భగవంతుడు కనుక సంహారకార్యం మొదలుపెడితే మనం ఎవ్వరం మిగలం. అందుకే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల శక్తిని కలుపుకొని దత్తాత్రేయ అవతారం ధరించి ప్రజలను ధర్మమార్గంలో తీసుకువెళ్లడానికి సంహార కార్యం కాదు సంస్కార కార్యం తీసుకురావడానికే దత్తుల వారు ఉద్భవించారని దత్త చరిత్ర చెబుతుంది. పూజ్య గురుదేవులు కూడా ధర్మ జాగృతి నెలకొల్పడం కోసం, అందరినీ ధర్మం వైపు నడిపింపజేయడం కోసం, సనాతన సంప్రదాయాన్ని గౌరవించడం నేర్పడం కోసం, చిన్ననాడే పిల్లలకు ఈ విషయాలు నేర్పించాలి. ఈ భారతదేశానికి శక్తి కేంద్రాలు మూడే మూడు - ఒడి-బడి-గుడి అని. ఇవి ప్రధానమైన సంస్కార కేంద్రాలు. పసిప్రాయంలో పిల్లలకు ధర్మాన్ని నేర్పగలిగితే, విద్యాలయంలో విలువలు నేర్పగలిగితే, దేవాలయంలో దైవభక్తిని, దేశభక్తిని నేర్పగలిగితే ఈ జాతి సంరక్షింపబడుతుందని భక్తులను ఉద్దేశించి బోధించారు.

అనంతరం భక్తులంతా దత్తాత్రేయుల వారి అన్నప్రసాదాన్ని స్వీకరించి ఆనందోత్సాహాలతో తరలివెళ్ళారు.

ఈ మహాయజ్ఞంలో ఆర్థికంగా, హార్థికంగా సహకరించిన వారందరికీ శ్రీ దత్తాత్రేయుల వారి కృపాకటాక్షములు ఎల్లవేళలా మీ వెన్నంటి ఉండాలని సాయివాణి మనసారా కోరుకుంటుంది.





# జ్ఞానే నిత్యసుఖి

– వి.ఎస్.ఆర్.మూర్తి

ఒకరోజు భగవాన్ అరుణాచలం నుండి దిగి వస్తుంటే వరుసగా భక్తులంతా నిలచుని ఉన్నారు. ప్రతివాళ్ల చేతుల్లో పళ్ళాలున్నై. పళ్లెంలో విత్తనాలున్నై. అందరూ గుంటలు తవ్వారు. నీళ్ళు పోయడానికి చెంబుల్లో నీళ్ళు పెట్టుకున్నారు. వాళ్ల ఉద్దేశ్యమేమిటంటే, భగవాన్ వస్తారు. ఆ గోతుల్లో విత్తనాలు వేస్తారు. గొయ్యి పూడ్చిన తరువాత కాస్త నీళ్ళు గనుక పోసినట్లయితే మళ్ళీ మొక్కలవుతయ్యి. ఈ కార్యక్రమం భగవాన్ చెయ్యాలి అని. ఇంతలోనే రామకృష్ణ అనే ఒక చిన్న పిల్లవాడు పెద్ద కేక వేశాడు. ఏం కేక వేశాడంటే, “భగవాన్! ఆగండి, మీరు వాటిని తాకవద్దు” అన్నాడు. “అదేంటి ఇలా అంటున్నావు? ఎందుకు నన్నలా ఆపుతున్నావు? నా పని నన్ను చెయ్యనివ్వు” అన్నారు, “భగవాన్! మీ చూపు సోకితేనే జన్మలన్నీ సమసిపోతాయట కదా! మరి ఆ విత్తనాలను మీ చెయ్యి తాకితే అవి మొలకెత్తేదెప్పుడు? చెట్లుగా మారేదెప్పుడు? ఇది జరిగే పని కాదన్నారు”. అప్పుడు భగవాన్ ప్రశంసాపూర్వకంగా చూసి యోగస్థితికి, వయస్సుకి, యోగానికి సంబంధం లేదు. ఏ వయస్సులో ఎవరికి ఏమో, తెలియదు. అదిగో అర్థం చేసుకున్నాడు కదా! అన్నారు. ఆయన విత్తనం ముట్టుకోలేదు.

అన్నామలై అని రమణాశ్రమ నిర్మాణంలో ఒక తాపీమేస్త్రీ. రోజూ పని చేసేవాడు. భగవాన్ అతని పక్కనే ఉండి సలహా ఇచ్చేవారు. ఇలా కట్టాలి, అలా కట్టాలి, ఇటుక ఇలా పెట్టాలి, అలా పెట్టాలి, ఈ గది ఇక్కడ ఉండాలి అని అన్నీ కర్మయోగంలో చేస్తూ ఉంటే రమణాశ్రమం పూర్తి అయింది. అవగానే, ఇక నువ్వు ఆశ్రమం నుంచి వెళ్ళిపోవచ్చును అని అన్నారు. అందరూ ఆశ్చర్యపోయారు. ఇంత కఠినుడా గురువు? హృదయమే లేదా? చేయించుకోవలసిన పనంతా చేయించుకుని ఇక నువ్వు వెళ్లవచ్చన్నారే?

అని అనుకుంటుండగా, గురువు చెప్పిన మాటలు విశ్వసించి, దాన్ని చక్కగా అనుసరిస్తూ, ఆశ్రమం నుంచి ఆయన వెళ్ళిపోయారు. వెళ్ళగానే ఆ మర్నాటినుంచే, ఆయన ఎక్కడ ఉన్నారో ప్రతిరోజూ అన్నామలై దగ్గరకి వెళ్ళేవారు. భగవాన్ "నెమ్మదిగా నువ్వు ఇక్కడ ఇల్లు కట్టుకో. అక్కడ పెద్ద ఇల్లు కట్టావు కదా అందరికోసం! నువ్వూ కట్టుకో" అన్నారు. నాకెందుకు అన్నాడు భక్తుడు. కట్టుకో అన్నారు. ఇల్లు కట్టబడింది. ప్రతిరోజూ భగవాన్ తాపీ పట్టుకున్నారు. ప్రతిరోజూ ఇసుక, సిమెంటు కలిపారు. ప్రతిరోజూ భగవాన్ పూర్ణానుగ్రహాన్ని చక్కగా రససిద్ధంగా, జీవితంలో ఇచ్చినటువంటి సందర్భం. అంటే ఒక జ్ఞాని అయినటువంటివాడు, యోగి అయినటువంటి వాడు, కర్మయోగంలో నిష్కామంగా, నికామంగా ఎలా ఉంటాడో చూపే సన్నివేశాలు.

రమణులకి, కంచి మహాస్వామికి మధ్య ఒక గొప్ప బాంధవ్యం. ఒక సంబంధం ఉంది. ఒక సన్నివేశం, ఏమిటా సన్నివేశం? తిరువణ్ణామలై వెళ్ళారు మహాస్వామి. అక్కడ జరుగుతున్నది జరుగుతుండగా రమణాశ్రమం మీదుగా పల్లకి వెళుతున్నది. పల్లకీ అక్కడ ఆపారు. గేటు అవతల రమణులు ఉన్నారు. గేటు ఇవతల మహాస్వామి ఉన్నారు. వీరు పల్లకీ దిగలేదు. వారు గేటు దాటి బయటికి రాలేదు. 2 ని.ల తరువాత మళ్ళీ బోయీలు పల్లకీ ఎత్తారు. పల్లకీ నడిచింది కొంతదూరం వెళ్ళిన తరువాత మహాస్వామిని ప్రశ్నించారు. 'ఇంత దూరం వెళ్ళాం కదా! రమణుల్ని చూసి వస్తే ఎలా ఉండేదో? అని.

"రమణులా? ఆయన నిజమైన సుఖి. మాకా? ఇదిగో ఈ పీఠం, బాదరబందీ, గుర్రాలు, లొట్టపిట్టలు, బంగారాలూ, వీటన్నింటికీ పూజ, ఇవన్నీ ఎలాగూ తప్పదు. ఆయనకి ఏమీ లేవు. కానీ అన్నీ ఉన్నటువంటి మహా స్వరూపుడు" అన్నారు.







# ఆశ్రమ భిక్ష పథకం

# అన్నదాన పథకం



శ్రీ సాయీ సేవా సమితి వారి ఆశ్రమం "సాయిధామం"లో అన్నదాన పథకం నడుస్తున్నది. అన్ని దానాల్లోకి అన్నదానం పుణ్యప్రదమని పెద్దలంటారు. శ్రీ సాయికి అన్నదానాలు చాలా ప్రీతిపాత్రం. ఆకలిగొన్న ఎవరికి అన్నం పెట్టినా అది నాకే చెందుతుందని బాబా కంఠోక్తిగా చెప్పారు. తను మాత్రమే వండుకొని తినడం పాపమని గీత చెప్పింది. అన్న దానాన్ని మించిన దానం లేదని అన్ని శాస్త్రాలు అంటున్నాయి. అందుచేత సాయీ భక్తులైన వారికి యీ పుణ్యప్రదమైన అవకాశం కల్పించటం కోసం ఈ పథకం రూపొందింపబడింది.

సభ్యత్వంగా రూ.6,116/-లు చెల్లించిన వారు యీ పథకంలో సభ్యులవుతారు. సంవత్సరానికొకసారి చొప్పన వారి పేరిట (వారు కోరిన తేదీన గోత్ర నామాలతో) శ్రీ సాయి అర్చన జరుగుతుంది. అదేరోజు వారి పేరిట ఆశ్రమంలో "భిక్ష" ఏర్పాటు చేయబడుతుంది. దీంట్లో వారు స్వయంగా కూడా పాల్గొనవచ్చు. ఆ రోజు వారిపేరు భోజనశాలలో బోర్డు మీద వ్రాయటం ద్వారా ప్రకటితమవుతుంది. సభ్యత్వపు రుసుము **"శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు"** పేరిట చెక్కుల ద్వారాగానీ, వ్యక్తుల ద్వారా గానీ పంపవచ్చు. సత్సంగాలలోనైనా యివ్వవచ్చు. ఈ పథకంలో చేరేవారు తమ చిరునామా, ఎవరి పేరుమీద జరగాలో వారి వివరాలు, చిరునామా, మొబైల్ ఫోన్ నెంబర్లు కూడా వ్రాసి పంపాలి.

సాయి బంధువులారా,

మీ పిల్లల జన్మదినాల పేరిటో, మీ వివాహ వార్షికోత్సవాల పేరిటో, గతించిపోయిన పెద్దల పేరిటో, మీ గురుదేవుల పేరిటో యీ పథకంలో మీరు భాగస్వాములు కండి. మీకు తెలిసిన వారికి కూడా యీ విషయం తెలియ జేయండి. ఆకొన్నవారి కడుపునింపి శ్రీ సాయినాథుల అపార కరుణకు పాత్రులు కండి. చిరునామా సాయివాణిదే.

**- ధర్మాధికారి, సాయిధామం,**
**శ్రీ సాయి సేవా సమితి ట్రస్ట్,**
**రామలింగంపల్లి పోస్టు, యాదాద్రి భువనగిరి జిల్లా-508126**